www.udayageethikadaily.com

# ఉదయ గీతిక

UDAYA GEETHIKA సమగ్ర జాతీయ తెలుగు దినపత్రిక

శనివారం, 20-9-2025, తెలంగాణ

సంపుటి: 2 సంచిక: 4 పేజీలు: 4, వెల: 2/-



www.udayageethikadaily.com

ఉదయ గీతిక

UDAYA GEETHIKA సమగ్ర జాతీయ తెలుగు దినపత్రిక


## ప్రత్యేక సంచిక



### విప్లవోద్యమ ధృవతార

# కాంపాటి చంద్రన్న

- నేడు కాంపాటి కోటన్న 17వ వర్ధంతి
- ప్రజా సమస్యలపై అనేక వీధి నాటికలు
- సారా వ్యతిరేక ఉద్యమంలో అబ్బురపరిచే కళారూపాలతో తండాల్లో చైతన్యం
- చిన్ననాడే సాయుధ దళాలతో అడుగులు వేసిన కాంపాటి

"కామ్రేడ్ చంద్రం నికార్సైన విప్లవ కార్యకర్త,ఇల్లందు విప్లవోద్యమం ఎదుర్కొన్న ఎన్నో సవాళ్ళను అధిగమించటంలో ఆయన భాగస్వామ్యం వుంది. అసెంబ్లీ ఎన్నికల నుండి స్థానిక ఎన్నికల వరకు పార్టీ గెలుపు కోసం కాలికి గజ్జె కట్టుకొని ప్రచారంచేశాడు.చంద్రం కన్ను మూసే నాటికి పాతికేళ్ల పాటు పార్టీ ఐక్యంగా వుండి అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడింది. చంద్రం మరణించిన కొద్ది కాలానికే పార్టీ చీలిక రావటం, చీలిన సంస్థలు ఆ తర్వాత మరిన్ని చీలికలకు గురికావటం విప్లవోద్యమాన్ని బలహీన పరిచాయి. నాయకుల మరణాలనే జీర్ణించుకోలేకపోయిన చంద్రం బ్రతికుంటే ఈచీలికలను చూసి ఎంత ఆవేదన చెందేవాడో..తన జీవితాన్ని విప్లవోద్యమానికి అంకితం చేసిన చంద్రం ధన్యజీవి.."

*"అది **1990** దశకం ప్రారంభ కాలం.జర్మన్ విప్లవ కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్ పీడి జనరల్ సెక్రెటరీ కామ్రేడ్ స్టీఫెన్ ఏంజెల్ భారతదేశ పర్యటనకు వచ్చాడు. ప్రత్యేకించి ఇల్లందు ఉద్యమ ప్రాంతాన్ని సందర్శించి నాయకులను, కార్యకర్తలను కలుసుకొని అనేక చోట్ల ప్రజలను ఉద్దేశించి హావభావాలతో ఉత్తేజ పూరితంగా ఆయన జర్మన్ భాషలో ప్రసంగించారు. వొంపుగూడెం పక్కన బోడు వద్ద ఆయన రహస్య దళాలను కూడా కలుసుకున్నాడు. అప్పటినుండి దాన్ని జర్మన్ బోడు అని ఇప్పటికీ ప్రజలు పిలుస్తున్న విషయం విదితమే. ఆయన పర్యటన పార్టీ శ్రేణులపై,ప్రజలపై మంచి ప్రభావం కలిగించింది. ఆయన పర్యటన ముగిసిన తర్వాత ఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అనేక బహిరంగ సభలలో ఓ కామ్రేడ్ స్టీఫెన్ ఏంజెల్ ని అనుకరిస్తూ అర్థం కాని భాషలో ఆయన లాగే హావభావాలతో గంభీ రోపన్యాసం చేయడం, దానిని మరో కామ్రేడ్ తెలుగులో సందర్భోచితంగా అనువాదం చేయడం శ్రోతలను విపరీతంగా ఆకర్షించింది.కామ్రేడ్ స్టీఫెన్ ఏంజెల్ హావభావాలతో ఆయనే వచ్చి మాట్లాడుతున్నాడా అన్నంతగా ప్రజలను ఆకట్టుకొంటూ మాట్లాడిన మనిషి కామ్రేడ్ కాంపాటి చంద్రం."*

2లో



## పార్టీ ఫిరాయింపులు.. కడియం శ్రీహరి స్పందన

*ఉదయ గీతిక (వరంగల్ న్యూస్): పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఆరుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించారు. 'గతంలో కేసీఆర్ **36** మందిని పార్టీలో చేర్చుకున్నారు. ఒక్కరి మీదైనా అనర్హత వేటు వేశారా? పార్టీ మారి పదవి అనుభవించట్లేను. నేను ఏ పార్టీలో ఉన్నాననే విషయం స్పీకర్ తేలుస్తారు. స్పీకర్‌కు కోర్టు సూచన చేసింది.. ఆదేశాలు ఇవ్వలేదు' అని తెలిపారు.*

***(మొదటి పేజీ తరువాయి)*** ఉపన్యాసాన్ని తెలుగులో అనువాదం చేసిన వ్యక్తి కామ్రేడ్ గండి యాదన్న.వీరిద్దరూ ఇప్పుడు మన మధ్య లేరు.అనేక సభలలో ఆటా పాటా మాటలతో ఇల్లందు ఉద్యమంలో గుర్తించదగ్గ పాత్రను పోషించి తుదిశ్వాస దాకా విప్లవోద్యమంలో కొనసాగిన ఈ ఇరువురు కామ్రేడ్స్ అనారోగ్యంతో అమరత్వం పొందారు.

### *కామ్రేడ్ చంద్రం కొమరారం పేద కుటుంబంలో పుట్టిన మట్టి బిడ్డ:*

ఆయన జీవితం అణచబడ్డ, దగాపడ్డ,వెలివేయబడ్డ ఆదివాసి దళిత బహుజనుల జీవితాలతో మమేకమై సాగింది. ఆనాడు ఇల్లందు ఉద్యమానికి ముఖ్యమైన కేంద్రంగా ఉన్న కొమరారం ప్రాంతంలో రహస్య దళాల ప్రభావంతో ఆయన విప్లవోద్యమంలో భాగస్వామి అయ్యాడు. కొమరారం ప్రాంతం అమరులు కామ్రేడ్స్ చంద్రం,యాదన్న, వై వెంకన్న లాంటి అనేకమంది కవులూ కళాకారులను ఎందరో మెరికల్లాంటి కార్యకర్తలను, నాయకులను విప్లవోద్యమానికి అందించింది. ఆ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని పనిచేసిన పార్టీ ప్రధాన నాయకులు కామ్రేడ్స్ భాస్కరన్న, ఎల్లన్న నేతృత్వంలో కామ్రేడ్ చంద్రం రహస్య దళాల్లో పనిచేశాడు. విప్లవోద్యమం ప్రతిఘాతకుల దాడులకు గురవుతున్న సందర్భంలో ఉద్యమ రక్షణ కోసం రహస్య దళాల్లోకి వెళ్లి పనిచేశాడు. ప్రజా ప్రతిఘటన దాడులనెదుర్కొనేందుకు నెలల తరబడి టీముతో వున్నాడు. దాసరి వీరయ్య దళం మాణిక్యారానికి చెందిన కామ్రేడ్ కోటన్నను హత్య చేసినప్పుడు పక్కనే వున్న చంద్రం సమయస్ఫూర్తితో తన దస్తీని మడిచి బాంబు వున్నట్లుగా వారిని బురిడీ కొట్టించి బయట పడ్డాడు. కామ్రేడ్ చంద్రం మంచి కళాకారుడే కాకుండా క్రమశిక్షణ కలిగిన విప్లవ కార్యకర్త కూడా. కటిక పేదరికం అనుభవిస్తూ కూడా విప్లవోద్యమమే జీవితంగా ఎంచుకున్నవాడు. పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేసేవాడు. ఎక్కడికంటే అక్కడికెళ్ళి పనిచేసేవాడు.కాచనపల్లి బూటకపు ఎన్కౌంటర్లో టేకులపల్లి మండలానికి చెందిన ప్రధాన నాయకులు కామ్రేడ్స్ నంబూరి సీతారామారావు,సుశేన, నోముల పరశు రాములు,చింతా లక్ష్మి అమరత్వం పొంది అక్కడ నాయకత్వ కొరత ఏర్పడిన సందర్భంలో పార్టీ నిర్ణయిస్తే ఆ ప్రాంతానికి వెళ్ళాడు. ఆయన ఎక్కడ పనిచేసినా అక్కడి ప్రజలతో అల్లుకు పోయేవాడు.వారి సమస్యల పరిష్కారం కోసం పరితపించేవాడు. కళారూపాల ప్రదర్శనలలో కూడా కామ్రేడ్ చంద్రం ప్రత్యేక ఆకర్షణగా ఉండేవాడు. సారా వ్యతిరేక వీధినాటిక, ఎన్నికల బాగోతం, మిమిక్రీ, గొంగడి బృందం తదితర ఆటా పాటలు ఏవైనా అందులో చంద్రం పాత్ర ప్రత్యేక ఆకర్షణగా వుండేది. దళాల కాడ తరచుగా విస్తృతంగా సమావేశాలు జరుగుతుండేది. ఆ సమావేశాల్లో దళ సభ్యులతో పాటు అందరూ కామ్రేడ్ చంద్రాన్ని పాట పాడాలని మిమిక్రీ చేయాలని డిమాండ్ చేసేవారు. తన కళ నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకునే విధంగా పార్టీ నాయకుల ఎడల ఎంతో గౌరవ భావంతో, విధేయతతో వుండేవాడు. నాయకులను ఏదైనా అడగాలంటే మొహమాట పడేవాడు. ఒక్కోసారి అన్నం తినలేదు అని చెప్పడానికి కూడా వెనకా ముందు ఆడేవాడు. ఒకసారి అమరుడు కామ్రేడ్ పాషన్నతోపాటు నేను, మరి కొందరం ఇల్లందు ఆఫీసులో ఉండగా టేకులపల్లి నుండి చంద్రం కూడా వచ్చి మాతో చేరాడు. పాషన్నని ఏదో అడగడానికి మొహమాటపడుతూ తలగోక్కుంటూ అటు ఇటు తిరగడాన్ని గమనించిన పాషా ***"ఏంటి కోటయ్య గారు ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నారు"*** అంటే అబ్బే ఏమిలేదన్నా అని పదినిమిషాలు అటు ఇటు తిరిగి మళ్ళీ వచ్చి ***"అన్న బండి ఇస్తే ఇంటికి వెళ్ళి పొద్దున్నే తిరిగి వస్తా"*** అన్నాడు. ముందు నువ్వు ఆలోచించేటప్పుడే అడిగితే ఇప్పటికీ కొమరారం వెళ్లిపోయేవాడివి కదా,దానికి అరగంట ఆలోచించాలా, నువ్వేదో భారత విప్లవాన్ని గురించి ఆలోచిస్తున్నా వనుకొన్నానని పాషా ఆట పట్టించాడు. చంద్రం ముసిముసిగా నవ్వుతుంటే పాషాతో పాటు అందరం పగలబడి నవ్వు కొన్నాం.

### *కామ్రేడ్ చంద్రం నికార్సైన విప్లవ కార్యకర్త.*

ఇల్లందు విప్లవోద్యమం ఎదుర్కొన్న ఎన్నో సవాళ్ళను అధిగమించటంలో ఆయన భాగస్వామ్యం వుంది. అసెంబ్లీ ఎన్నికల నుండి స్థానిక ఎన్నికల వరకు పార్టీ గెలుపు కోసం కాలికి గజ్జె కట్టుకొని ప్రచారంచేశాడు.చంద్రం కన్ను మూసే నాటికి పాతికేళ్ల పాటు పార్టీ ఐక్యంగా వుండి అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడింది. చంద్రం మరణించిన కొద్ది కాలానికే పార్టీ చీలిక రావటం, చీలిన సంస్థలు ఆతర్వాత మరిన్ని చీలికలకు గురికావటం విప్లవోద్యమాన్ని బలహీన పరోచాయి.నాయకుల మరణాలనే జీర్ణించుకోలేకపోయిన చంద్రం బ్రతికుంటే ఈ చీలికలను చూసి ఎంత ఆవేదన చెందేవాడో..తన జీవితాన్ని విప్లవోద్యమానికి అంకితం చేసిన చంద్రం ధన్యజీవి.. ఆయనను విప్లవోధ్యమం సదా గుర్తుంచుకొంటుంది. *జోహార్ కామ్రేడ్ కాంపాటి చంద్రం..*

*-గౌని ఐలయ్య,*
*సిపిఐ(ఎంఎల్)-ఎన్డీ, రాష్ట్ర నాయకులు*




## జూనియర్ ఎన్టీఆర్ కు స్వల్పగాయాలు

*ఉదయ గీతిక (ఫిల్మ్‌సిటీ) సెప్టెంబర్ 20:* టాలీవుడ్ నటుడు జూనియర్ ఎన్టీఆర్ శుక్రవారం ఒక యాడ్ షూటింగ్‌లో స్వల్ప గాయాల పాలయ్యారు. ఆయన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో, వైద్యుల సలహా మేరకు ఎన్టీఆర్ రెండు వారాల పాటు విశ్రాంతి తీసుకుంటారని, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎటువంటి ఊహాగానాలను నమ్మవద్దని కార్యాలయం విజ్ఞప్తి చేసింది. షూటింగ్ సమయంలో అనుకోకుండా కిందపడటంతో గాయాలైనట్లు సమాచారం.

## ఈసీ ప్రకటన.. 474 పొలిటికల్? పార్టీల గుర్తింపు రద్దు

*ఉదయ గీతిక, ఢిల్లీ : గుర్తింపులేని పార్టీలపై ఈసీఐ దృష్టి పెట్టింది. మొదటి విడతలో 334 రిజిస్టర్డ్ పార్టీలను రద్దు చేసిన ఈసీఐ తాజాగా 474 పార్టీల గుర్తింపు రద్దు చేసింది. దీంతో ఇప్పటివరకు మొత్తం 808 రిజిస్టర్ పార్టీల గుర్తింపును ఈసీఐ రద్దు చేసింది. మరో 359 పార్టీల గుర్తింపు రద్దు చేసే ప్రక్రియలో ఉన్నట్లు సమాచారం. తాజాగా ఏపీలో 17, తెలంగాణలో 9 రాజకీయ పార్టీల గుర్తింపు రద్దు చేసింది. ప్రస్తుతం 6 జాతీయ పార్టీలు, 67 ప్రాంతీయ పార్టీలు ఉన్నాయని పేర్కొంది.*

## నూతన తహశీల్దార్‌గా
## అనూష బాధ్యతలు స్వీకరణ



*ఉదయ గీతిక, సెప్టెంబర్ 20 :* ఆళ్ళపల్లి మండల నూతన తహశీల్దార్‌గా అనూష శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తాసిల్దార్‌గా పనిచేసిన శ్రీనివాస్ యాదవ్ బదిలీపై వెళ్లడంతో, ఆమె ఈ స్థానంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని నూతన తహశీల్దార్ అనూష తెలిపారు.